క్లుప్తంగా

వ్యాయామ దుస్తులు అందజేత



వ్యాయామ దుస్తుల్లో విద్యార్థులు

గార: మండలంలోని కె.మత్స్యలేశం మోడల్ ప్రైమరీ పాఠశాల విద్యార్థులకు ఇంటర్మీడియెట్ మిత్రుల బృందం వ్యాయామ దుస్తులను బుధవారం అందజేసింది. పాఠశాల హెచ్ఎం టి.సుధీర్‌కుమార్, తనతో పాటు ఇంటర్ చదువుకున్న 8 మంది విద్యార్థులు రూ.25 వేలు విలువ చేసే దుస్తులు, షూస్ అందజేశారు. ఆర్థిక సాయం అందజేసిన చక్రధర్, లోకేష్, సత్యం, రాణిమోహన్, మాధురి, శ్రీదేవి, జ్యోతి, భోగి శ్రీనులకు హెచ్ఎం, ఉపాధ్యాయులు ధన్యవాదాలు తెలిపారు.

గురుకుల పాఠశాలకు వితరణ



వితరణగా అందజేసిన సామగ్రితో దాతలు, ప్రిన్సిపాల్ సంధ్య, సిబ్బంది

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం నగరంలోని హయాతీనగర్‌లో ఉన్న మహాత్మా జ్యోతిబాపూలే ఏపీ వెనుకబడిన తరగతుల బాలికల సంక్షేమ గురుకుల పాఠశాలకు ఉపయోగకరమైన ఎలక్ట్రానిక్ సామగ్రిని శ్రీవాసవి సేవా సమితి శ్రీకాకుళం ఆధ్వర్యంలో పట్టణ ఆర్యవైశ్య సభ్యులు అందజేశారు. మూడు సీలింగ్ ఫ్యాన్లు, పది ఎల్ఈడీ ట్యూబ్‌లైట్లను తమ పాఠశాలకు వితరణగా అందజేసినట్లు ప్రిన్సిపాల్ పి.సంధ్య తెలిపారు. దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

పనిభారం నుంచి విముక్తి కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఐక్యవేదిక ప్రతినిధులు

గార: గ్రామ సచివాలయ ఉద్యోగులకు అదనపు పనివేళల్లో పనిభారం నుంచి విముక్తి కల్పించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయాల ఐక్యవేదిక మండల సభ్యులు కోరారు. ఈ మేరకు రాష్ట్ర ఐక్యవేదిక పిలుపు మేరకు ఎంపీడీవో ఎ.రఘుకు వినతిపత్రం బుధవారం అందించారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయ ఐక్యవేదిక మండల ప్రెసిడెంట్ ఆర్.కనకసుందరరావు, వైస్ ప్రెసిడెంట్ కాశిన సూర్యభరత్‌లు మాట్లాడుతూ.. తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అవినీతి రహిత సమాజానికి కృషి



మాట్లాడుతున్న సీఐ రవిప్రసాద్

శ్రీకాకుళం అర్బన్: అవినీతి రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరం కృషి చేద్దామని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ విజిలెన్స్ సీఐ రవిప్రసాద్ అన్నారు. ఏపీజీవీబీ బ్యాంక్ రీజనల్ కార్యాలయంలో బుధవారం బ్యాంక్ విజిలెన్స్ వారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ క్రైమ్స్‌పై ప్రజలకు మరింతగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే ముఖ్యమైన ప్రదేశాలు, కూడళ్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం అవినీతి రహిత సమాజం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏపీ జీవీబీ రీజనల్ మేనేజర్ లావేటి అనంతరావు తదితరులు పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణ



అన్నసంతర్పన చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): గణపతి నవరాత్రులు పురస్కరించుకొని నగరంలోని చంపాగల్లివీధిలో కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో బుధవారం అన్న సంతర్పణ జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఉపాధ్యక్షుడు మెంటాడ స్వరూప్ మాట్లాడుతూ ఈ ఏడాది ఉత్సవాలను కమిటీ సభ్యులు విజయవంతంగా నిర్వహించారని అభినందించారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి లంకా రమేష్, మెట్ట రజిని, కలిశెట్టి రాంబాబు, పార్వతీశం, కాశీ, చింతలపూడి కిరణ్, షేక్ ఉసాప్, టి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఒకరి మృతి

శ్రీకాకుళం రూరల్: గూడెం గ్రామంలో బుధవారం విద్యుత్ షాక్‌తో రావాడ కృష్ణారావు(53) అనే వ్యక్తి మృతిచెందాడు. గృహ నిర్మాణ పనులు చేస్తున్న సమయంలో ఇనుప చువ్వ పైనున్న 11 కె.వి. విద్యుత్ తీగలను తాకడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ప్రకటించారు. మృతుడి భార్య భారతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాము తెలిపారు.

పశు బీమాకు మంగళం..?

- స్పష్టతనివ్వని కూటమి ప్రభుత్వం
- నష్టపోతున్న పాడి రైతులు



ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గొర్రెలు(ఫైల్)

రణస్థలం: పాడి రైతులకు అండగా నిలిచే పశు బీమా పథకానికి కూటమి ప్రభుత్వం మంగళం పాడినట్లు తెలుస్తోంది. పశువుల పెంపకంతో బతికే వారంతా కష్టాలు పడాల్సిన దుస్థితి నెలకొంది. వర్షాకాలం కావడంతో అనుకోని విపత్తులతో పశువులు మృత్యువాత పడితే ఆ సమయంలో పశు బీమా కొంత ఊరటనిస్తుంది. అయితే అలాంటి బీమాపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టతనివ్వకపోవడంతో పాడి రైతులు నష్టపోయే అవకాశం ఉంది. వర్షాకాలంలో రోడ్డు ప్రమాదాలు, ప్రకృతి వైపరీత్యాలు, విద్యుత్ ఘాతాలు సంభవించినప్పుడు పశువులు మృతి చెందే అవకాశాలు ఉంటాయి. వీటికి తోడు వ్యాధుల కాలం వర్షాకాలంలో గేదెలు, ఆవులు, జీవాలకు హెచ్ఎస్‌బీక్యూ, గాలికుంటూ, థైలేరియా తదితర వ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. కొన్ని ప్రాణాంతక వ్యాధులు సోకడం వలన పశువులు మృత్యువాత పడుతుంటాయి.

పాడి రైతులకు ఇబ్బందులు

ఇటీవల రణస్థలం మండలంలోని వరిశాం సమీపంలో జాతీయ రహదారిపై గొర్రెలను గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో 20 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందగా, మరో 10 తీవ్రంగా గాయపడ్డాయి. పాడి రైతులకు సుమారు రూ.4 లక్షల నష్టం వాటిల్లింది. పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. కానీ బీమా సౌకర్యం లేకపోవడంతో సదరు పాడి రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది. ఇలాంటి సందర్భాల్లో బీమా ఉంటే కొంతమేర పాడి రైతుకు అసరాగా ఉంటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో...

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పశు బీమా పథకం పక్కాగా అమలు జరిగింది. పాడి పశువు మృతి చెందితే రూ.30 వేల వరకు పరిహారం అందించి ఆదుకుంది. గొర్రెలకు, మేకలకు రూ.10 వేల వరకు వస్తే కొంతమేర సహకారంగా ఉండేది. ప్రభుత్వం తరపున పశు వైద్యాధికారులు ఇచ్చిన వివరాల ఆధారంగా బీమా ప్రీమియం చెల్లించేవారు. కానీ కూటమి పాలనలో బీమా పథకానికి తూట్లు పొడిచి పాడి రైతుకు కష్టాలు మిగిల్చారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎడాదిన్నర కావస్తున్నా పశు బీమాపై ఇంతవరకు ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడం దారుణమని వాపోతున్నారు.

ఎచ్చెర్ల నియోజకవర్గంలో పాడి జీవాల వివరాలు

మండలం	ఆవులు	గేదెలు	గొర్రెలు	మేకలు
ఎచ్చెర్ల	16,345	390	10,369	7,717
జి.సిగడాం	17,175	131	10,493	5,311
లావేరు	24,811	1,642	27,779	11,388
రణస్థలం	16,844	905	58,178	8,487

బీమా సౌకర్యం కల్పించాలి



గొర్రెలు, మేకలకు బీమా సౌకర్యం కల్పించాలి. గతంలో ప్రీమియం ప్రభుత్వమే చెల్లించేది. ప్రస్తుతం ప్రమాదవశాత్తు మూగజీవాలు మృత్యువాత పడితే పూర్తిగా నష్టపోతున్నాం. మాకు సంబంధించిన 20 గొర్రెలు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాయి. ఇలాంటి సమయంలో బీమా సౌకర్యం లేకపోవడం వలన తీవ్రంగా నష్టపోతున్నాం.

– పిట్ట రమణ, జీఆర్‌పురం, రణస్థలం మండలం

ఆదేశాలు రాలేదు

ప్రభుత్వం నుంచి ఆవులు, గేదెలు, గొర్రెలు ఇతరత్రా పెంపుడు జీవాలకు సంబంధించిన బీమా ప్రీమియం కట్టించేందుకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు ఇంతవరకు అందలేదు. ఆదేశాలు వచ్చిన వెంటనే బీమా సౌకర్యం కల్పిస్తాం.

– బి.దుర్గారావు, పశు సంవర్ధక శాఖ ఏడీ, రణస్థలం

పరామర్శ



నారాయణరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల: మండలంలోని తోటపాలేం, ఇబ్రహీంబాద్ గ్రామాల్లో పలువురి కుటుంబాలను ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ బుధవారం పరామర్శించారు. ఇబ్రహీంబాద్ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సనపల నారాయణరావుకు మనవడు పుట్టి మృతి చెందినట్లు తెలుసుకుని, బుధవారం ఆయన స్వగృహంలో కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. పసికందు మృతి చెందడంపై ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయనతో పాటు సర్పంచ్ సూర అప్పారావు, మాజీ సర్పంచ్ ఎర్రంనాయుడు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కిల్లి రఘురాం, దున్నాన సీతారాం, నాగభూషణ్ తదితరులు ఉన్నారు. అలాగే తోటపాలేం గ్రామంలో మాజీ సర్పంచ్ కళ్లేపల్లి తిరుపతిరావు సోదరుడు ఇటీవల హఠాన్మరణం చెందడంతో తిరుపతిరావు కుటుంబాన్ని పరామర్శించారు. పరామర్శలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సనపల నారాయణరావు, మంత్రి కిషోర్‌కుమార్, సూర్యనారాయణ, అమర్‌నాథ్, సీతారాం తదితరులు ఉన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వద్దు



సమావేశంలో మాట్లాడుతున్న సరిత

జి.సిగడాం: గ్రామస్థాయిలో విధులు నిర్వహిస్తున్న అధికారులు అంకితభావంతో పనిచేయాలని, ఎవరైనా అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ మహాదేవు సరిత హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో రైతులకు నెలకున్న భూ సమస్యలపై ప్రత్యేక దృష్టిపెట్టి, వాటిని పరిష్కారం చేసే దిశగా పని చేయాలని సూచించారు. రైతుల నుంచి నీటి తీరువా వసూళ్లు చేయాలని లేనిపక్షంలో సంబంధిత వీఆర్వోలపై చర్యలు తప్పవన్నారు. రైతులు బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాలను రెన్యూవల్ చేసేందుకు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో డీటీ ఎస్.నిర్మల, ఆర్ఎస్ డీటీ గాయత్రి, ఆర్ఐ అబోతుల రాధ, భూపతి నరింగరావు తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 15 నుంచి వ్యాక్సినేషన్



డెయిరీ ఫారం పరిశీలిస్తున్న జేడీ రాజగోపాలరావు

రణస్థలం: ఈనెల 15వ తేదీ నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకు నెల రోజుల పాటు పశు సంపద అభివృద్ధి కోసం మూడు నెలలు దాటిన ఆవులు, గేదెలకు ఎఫ్ఎండీ వ్యాక్సినేషన్ చేయనున్నామని జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ కె.రాజగోపాలరావు తెలిపారు. మండలంలోని లంకపేట, యర్రవరం గ్రామాల్లోని కోళ్ల ఫారం, ఆవుల డెయిరీ ఫారాలను బుధవారం పరిశీలించారు. ఆడ దూడల ఉత్పత్తికి ట్రిపుల్ ఎక్స్ డోస్‌ను పాడి రైతులు ఉపయోగించుకోవాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రణస్థలం ఏడీఏ బి.దుర్గారావు, ఏడీఏ బి.యోగేశ్వరరావు, పాతర్లపల్లి పశువైద్యాధికారి బి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు

- యూరియా సక్రమంగా సరఫరా చేయాలి
- సర్వసభ్య సమావేశంలో ధ్వజమెత్తిన వైఎస్సార్‌సీపీ సభ్యులు



టీడీపీ, వైఎస్సార్‌సీపీ సభ్యుల మధ్య వాగ్వాదం జరుగుతున్న దృశ్యం

రణస్థలం: గ్రామాల్లో బెల్టు షాపుల ద్వారా విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు జరుగుతున్నా, ఎక్సైజ్ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని వైఎస్సార్‌సీపీ సభ్యులు ప్రశ్నించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లుట్ట అమ్మాజమ్మ, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు రొక్కం బాలకృష్ణ అధ్యక్షతన మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ కార్యకర్తలకు మాత్రమే పనులు కేటాయిస్తున్నారని పలువురు సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. యూరియా సక్రమంగా సరఫరా చేయడం లేదని, కొంతమంది వ్యక్తులు పక్క జిల్లాలోని బంధువులకు చేరవేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎంపీటీసీల గౌరవ వేతనంపై ఎంపీటీసీ సభ్యులు ఎంపీడీవోని ప్రశ్నించగా మార్చి నెలలో సీఎఫ్ఎంఎస్ పోర్టల్లో అప్‌లోడ్ చేశామని, ప్రస్తుతం బిల్లులు ప్రాసెస్‌లో ఉన్నట్లు చెప్పారు.

టీడీపీ, వైఎస్సార్‌సీపీ నేతల వాగ్వివాదం

బుడతవలస టీడీపీ ఎంపీటీసీ ముల్లు సాయి మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో తమ పరిసర గ్రామాలైన గుమ్మడం గ్రామానికి రూ.18.50 లక్షలు, తాళ్లవలస గ్రామానికి రూ.19.50 లక్షల మండల నిధులు కేటాయించారని, అధికార పార్టీలో ఉన్న బుడతవలసకు కేవలం రూ.6 లక్షలే నిధులు కేటాయించారని సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ అభ్యంతరం వ్యక్తం చేస్తూ, ప్రస్తుతం మండలంలో టీడీపీ కార్యకర్తలకు మాత్రమే పనులు అప్పగిస్తున్నారని విమర్శించారు. దీనిపై టీడీపీ, వైఎస్సార్‌సీపీ సభ్యుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. దీంతో సభ్యులను రొక్కం బాలకృష్ణ సముదాయించారు. మండలంలో అభివృద్ధి పనులకు ఆటంకం కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సమావేశంలో ఎంపీడీవో పి.వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

పంచామృతాభిషేకం



గణపతికి పంచామృతాభిషేకం చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని ఉమారుద్ర కోటేశ్వర స్వామివారి దేవాలయంలో వేంచేసియున్న దక్షిణముఖ వరసిద్ధి వినాయక స్వామికి బుధవారం భాద్రపద మాసంలో సంకష్ట హర చతుర్థి సందర్భంగా ప్రదోషకాల సమయంలో పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారికి సహస్ర నామావళి అర్చన జరిగింది. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు శ్రీకారం



పందిరి రాట మహోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని మొండేటి వీధిలో వెలసివున్న లలితాదేవి సహిత శివ కామేశ్వర ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలకు బుధవారం శ్రీకారం చుట్టారు. మహోత్సవాలకు సంబంధించి బుధవారం పందిరి రాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆకస్మిక తనిఖీలు



రికార్డులు తనిఖీ చేస్తున్న డిప్యూటీ డీఈవో విజయకుమారి

జి.సిగడాం: స్థానిక మోడల్ స్కూల్‌లో డిప్యూటీ డీఈవో విజయకుమారి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయలతోపాటు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉపాధ్యాయులు విద్యను బోధించడం, ఎండీఎం, రికార్డుల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమెతో పాటు ఎంఈవోలు అరసాడ రవి, ముళ్ల శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ డి.గణేష్ పట్నాయక్, ఉపాధ్యాయులు కోట తిరుపతిరావు, సురేష్, నేతాజీ, సుబ్రహ్మణ్యం, సతీష్, ముత్యాలరావు, వైకుంఠరావు, నాగమణి, జ్యోత్స్న, దుర్గారావు, ఆదినారాయణ, ప్రమీల, అరుణకుమారి, ధనలక్ష్మి, భాగ్య, శ్రీలహరిలు ఉన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత



ధ్యానం చేస్తున్న విద్యార్థులు

ఎచ్చెర్ల: ధ్యానంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని బాబాజీ సుష్మున్న క్రియ యోగా ఫౌండేషన్‌కు చెందిన ఎస్.శిరీష తెలియజేశారు. స్థానిక ట్రిపుల్ ఐటీ ప్రాంగణంలో విశాఖపట్నంకు చెందిన బాబాజీ సుష్మున్న క్రియ యోగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ధ్యాన శిబిరం బుధవారం నిర్వహించారు. కార్యక్రమం విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని, సానుకూల దృక్పథం ఏర్పడుతుందని ప్రొఫెసర్ కేవీజీడీ బాలాజీ తెలిపారు. ఇమేజ్ ఇన్నోవేటివ్ సాఫ్ట్‌వేర్ సంస్థ తమ క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించడం విశేషమన్నారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి డాక్టర్ మునిరామకృష్ణ, డీన్ డాక్టర్ శివరామకృష్ణ, ఫైనాన్స్ అధికారి వాసు, వెల్ఫేర్ డీన్ డాక్టర్ గేదెల రవి, డాక్టర్ హెచ్ఎస్‌వీ ప్రసాద్, ఎన్.సతీష్, యోగా విభాగాధిపతి డాక్టర్ ఈశ్వరరావు, యోగా శిక్షకురాలు కె.అర్చన, పీఆర్వో మామిడి షన్ముఖ తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో జీవితంలో విజయాలు



మాట్లాడుతున్న నాగరాణి

శ్రీకాకుళం అర్బన్: యుక్త వయస్సులో సరైన అవగాహన ఉంటే జీవితంలో విజయాలు సాధించవచ్చని ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్ట్ అధికారి నాగరాణి అన్నారు. నగరంలోని ఏపీఎన్ మున్సిపల్ హైస్కూల్‌లో సంకల్ప కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, గ్రామాల్లో ఇలాంటి వివాహాలను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. తెలియని వ్యక్తుల మాయమాటల్లో చిక్కుకోకూడదని సూచించారు. అనంతరం అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఏపీఎన్ఎం పాఠశాల హెచ్ఎం ఏవీ మురళీకృష్ణ, ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు పి.సీతామహాలక్ష్మి, యశోద, కల్యాణి, యోగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బెజ్జిపురం మండలాన్ని ఏర్పాటు చేయాలి



డీఆర్వో వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రణస్థలం: పాలనా సౌలభ్యంలో భాగంగా లావేరు మండల పరిధిలో ఉన్న బెజ్జిపురం మండలం పేరుతో నూతన మండలాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ 16 పంచాయతీల నుంచి రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా ముందుకు వచ్చి గురువారం కలెక్టరేట్ ఎదుట నినాదాలు చేశారు. అనంతరం కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావుకు బెజ్జిపురం మండల సాధన కమిటీ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. మండల వ్యవస్థ ఏర్పాటు అయిన నాటి నుంచి ఎన్నోఏళ్లుగా బెజ్జిపురం మండల కేంద్రంగా ప్రకటించామని డిమాండ్ చేస్తున్నామని చెప్పారు. వారం రోజుల్లో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులను కలిసి వినతిపత్రాలు సమర్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బెజ్జిపురం మండల సాధన కమిటీ ప్రతినిధులు విశ్రాంత అదనపు జాయింట్ కలెక్టర్ రెడ్డి గున్నయ్య, బెజ్జిపురం యూత్‌క్లబ్ అధ్యక్షుడు ఎం.ప్రసాదరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దన్నాన రాజినాయుడు, టీడీపీ మాజీ జెడ్పీటీసీ పిన్నింటి మధుబాబు, బీజేపీ నాయకుడు ఇజ్జాడ శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు బొంతు సూర్యనారాయణ, మీసాల రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక సదస్సులు నిర్వహించాలి



మాట్లాడుతున్న స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: ఆత్మహత్యల నివారణకు విద్యార్థులు, యువత, మహిళలకు ప్రత్యేకంగా సదస్సులు ఏర్పాటు చేసి, వారిలో ఆత్మనూన్యతా భావం లేకుండా ధైర్యం కల్పించాలని స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు అన్నారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో శ్రీకాకుళంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఒక్క క్షణం ఆలోచించి నిర్ణయం తీసుకుంటే సంపూర్ణ జీవితాన్ని అనుభవించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గేదెల ఇందిరాప్రసాద్, ఎస్.జోగినాయుడు, వావిలపల్లి జగన్నాథంనాయుడు, పోటీ పరీక్షల కేంద్రాల నిర్వాహకుడు రామకృష్ణ, బెవర వెంకట రవిశంకర్, గేదెల లక్ష్మి, గుడ్ల జగ్గారావు, ఎండ మోహన్, జామి రాధాకృష్ణ, పట్నాన శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలి

గార: అంగన్‌వాడీలకు కనీస వేతనాలు అమలు చేస్తామని చెప్పిన కూటమి పార్టీ నాయకులు మాట నిలబెట్టుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు అన్నారు. బుధవారం గారలో ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ మరియు హెల్పర్స్ యూనియన్ గార ప్రాజెక్టు మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 జూలైలో వేతనాలు పెంచుతామని మినిట్స్ ఇచ్చారని, నేటికీ కూటమి ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.కల్యాణి, డి.సుధ తదితరులు పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

ఎచ్చెర్ల: స్థానిక వేంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం కెరీర్ గైడెన్స్, సాఫ్ట్‌స్కిల్స్, లేటెస్ట్ ఎమర్జెన్సీ టెక్నాలజీపై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. రీసోర్స్ పర్సన్‌గా డీఎన్ఆర్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ రామకిశోర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. లోకల్, గ్లోబల్ ప్లేస్‌మెంట్ అవకాశాలు ఎలా ఉన్నాయో, ఎలా ఎదుర్కోవాలనే అంశాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌సీవీ రమణమూర్తినాయుడు తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ కలయిక



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1972వ సంవత్సరంలో బీఎస్సీ పూర్తి చేసిన విద్యార్థులు నగరంలోని ఒక హోటల్‌లో బుధవారం 53 ఏళ్ల తర్వాత ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అప్పటి రోజులు గుర్తు చేసేలా పలువురు తమ ప్రసంగాలు, పాటలతో అలరించారు. కార్యక్రమంలో పిండి నాగేశ్వరరావు, బొడ్డేపల్లి చిరంజీవిరావు, ఎ.కాశిబాబు, పీఎస్సార్ మూర్తి, దుంపల సన్యాసిరావు, ఎం.పాపారావు తదితరులు పాల్గొన్నారు.

బాలికలు ఉన్నత విద్యనభ్యసించాలి



ర్యాలీ పాల్గొన్న పాపినాయుడు తదితరులు

జి.సిగడాం: గ్రామాల్లోని బాలికలు ఉన్నత విద్యనభ్యసించాలని ఎచ్చెర్ల ఐసీడీఎస్ సీడీపీవో డోల పాపినాయుడు అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ, ఆదర్శ పాఠశాలల్లో మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా సంకల్పం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికా విద్యతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలు చేస్తుంటారని, వీటి వలన కలిగే నష్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.గణేష్ పట్నాయక్, సూపర్‌వైజర్ తమ్మినేని లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు మహాధ్యాస్యం రాధిక, సువ్వాడ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
శ్రీకాకుళం: 9951602845, 9951602849, 9912220367, 9705444191, 9010299083
ఎచ్చెర్ల: 9951602849
Office mail : sklmadvt@gmail.com